క్లుప్తంగా

సభాస్థలం ఏర్పాట్లు పరిశీలన



మలికిపురంలో సభాస్థలం ఏర్పాట్లపై సీఐతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: స్థానిక కనకదుర్గ అమ్మవారి ఆలయానికి సమీపాన వైఎస్సార్ సీపీ సభాస్థలం ఏర్పాట్లను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మంగళవారం పరిశీలించారు. ఈ నెల 5న వైఎస్సార్ సీపీ సామాజిక బస్సుయాత్ర నియోజకవర్గంలో జరగనున్న నేపథ్యంలో మలికిపురంలో సభాస్థలం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ మేరకు రాజోలు సీఐ గోవిందరాజుతో తీసుకోవాల్సిన చర్యలను ఎమ్మెల్యే సమీక్షించారు. అలాగే ఎస్సై సంపత్‌కుమార్‌కు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, నియోజకవర్గ స్థాయిలోని పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.4.76 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధి



ముక్తేశ్వరం వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం సెంటర్ నుంచి విలస గ్రామం వరకూ 4 కిలోమీటర్ల మేర రూ.2.03 కోట్లతో, అయినవిల్లి నుంచి మడుపల్లి శివారు వరకూ 4.4 మీటర్ల రూ.2.73 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను సీఎంఓ నిధులతో నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. ఈ పనులకు మంగళవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. నిత్యావసరాలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రహదారుల బాగుండాలన్నారు. అది గుర్తించే సీఎం రహదారులను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు వార జయసావిత్రి, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాస్ఫూర్తి పెంపు

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల ద్వారా క్రీడాస్ఫూర్తి పెరుగుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి (డీఎస్‌డీఓ) డి.సురేష్‌కుమార్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని డీఎస్‌డీఓ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందన్నారు. అనంతరం హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌ను సురేష్‌కుమార్ ప్రారంభించారు. అమలాపురం జోన్ వ్యాయామ అధ్యక్షుడు ఉండ్రు ముసలయ్య, పీడీలు కుంపట్ల ఆదిలక్ష్మి, గణేష్, ఇళ్ల భీమేష్ పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన

రాజోలు: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కొత్త ఓట్లు నమోదు దరఖాస్తుల స్వీకరణ, తొలగింపు, మార్పులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే రాజోలు, పొదలాడ గ్రామసచివాలయాల పరిధిలో ఓటర్లకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై వీఆర్వోలు ఎం.గంగాధర్, తోట శ్రీను, వెంకటేష్‌లు అవగాహన కల్పించారు. ఓటు వేసే సమయంలో ఈవీఎంలు ఎలా పని చేస్తాయో వివరించారు. ఈవీఎం ద్వారా వేసిన ఓట్ల లెక్కింపు జరిగే ప్రక్రియపై అవగాహన కల్పించారు. నాయకులు కొపనాతి రాజు, స్థానిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

కొత్తపేట: అదృశ్యమైన ఒక యువకుడు ప్రధాన పంటకాలువలో శవమై తేలగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై జ్వాలాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావులపాలెం గ్రామానికి చెందిన సింహాద్రి వినయ్‌కుమార్ (17) అనే యువకుడు మండపేటలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. గత నెల 31న రాత్రి పార్టీకి అని వెళ్లాడు. అయితే అప్పటి నుంచి కనిపించలేదు. కాగా మంగళవారం ఉదయం కొత్తపేట మండలం మందపల్లి వద్ద బొబ్బర్లంక-ముక్తేశ్వరం కాలువలో తేలగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కొత్తపేట పోలీసులు బయటకు తీసి గుర్తు తెలియని మృతదేహంగా పీఎం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దర్యాప్తు జరపగా రావులపాలెం గ్రామానికి చెందిన సింహాద్రి వినయ్‌కుమార్‌గా కనుగొన్నారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పింఛనోత్సాహం

- 2,750 నుంచి రూ.3,000కి పెరిగిన పింఛన్
- నియోజకవర్గంలో నేడు పంపిణీకి శ్రీకారం

మండలాల పింఛను వివరాలిలా...

మండలం	గత నెల	కొత్తవి	మొత్తం
కొత్తపేట	10,703	124	10,827
రావులపాలెం	12,078	110	12,188
ఆత్రేయపురం	9,831	186	10,017
ఆలమూరు	11,154	167	11,321
మొత్తం	43,766	587	44,353



కొత్తపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో 'వైఎస్సార్ పింఛను కానుక' ఒకటి. ఈ పింఛన్ నాలుగేళ్లలో రూ.3 వేలకు పెంచుతా.. అని ఆయన ఆనాడే చెప్పారు. చెప్పినట్టుగానే ఇలా వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు రూ.2 వేలకు పెంచిన పింఛను నాలుగేళ్లలో ఏటా రూ.250 చొప్పున పెంచుతూ ఈ నెల నుంచి రూ.3,000 కి పెంచి పంపిణీ చేస్తున్నారు. అలాగే అర్హులైన వారందరికీ ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసింది. నియోజకవర్గంలో ఈ కార్యక్రమానికి బుధవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. గత ఏడాది డిసెంబర్ నెల వరకూ కొత్తపేట నియోజకవర్గంలో 43,766 మంది పింఛన్లు పొందుతున్నారు. వారందరూ గత నెల వరకూ రూ.12,27,41,500 తీసుకోగా ఈ నెల నుంచి అదనంగా 587 మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. దాంతో మొత్తం పింఛనుదారుల సంఖ్య 44,353 కి పెరిగాయి. అలా అదనంగా రూ.250 తో కలిపి ఈ నెల అదనంగా రూ.63,49,000తో మొత్తం రూ.12,90,90,500 లబ్ధి పొందనున్నారు.

దేశంలో ఎక్కువ పింఛన్లు ఇస్తున్న ఘనత జగన్‌దే

పి.గన్నవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా ఎక్కువ మందికి పింఛన్లు ఇస్తున్న ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే చిట్టిబాబు కొత్తగా పింఛన్లు మంజూరైన 169 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.3 వేల వంతున మొత్తం రూ.5.07 లక్షలను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎం.భారతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన జగన్‌కే దక్కిందన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, సర్పంచ్‌లు కొంబత్తుల ఏసుబాబు, గుడాల రామారావు, యల్లమెల్లి కృష్ణవేణి, పార్టీ రాష్ట్ర నాయకుడు దొమ్మేటి వెంకట శివరామన్, నాయకులు దాసరి కాశీ, ముక్కామల భారతి తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో కొత్తగా మంజూరైన పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

సామాజిక బస్సు యాత్ర విజయవంతం చేయాలి



గుడిమూలలో పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లిబాబు

సఖినేటిపల్లి: మలికిపురం కనకదుర్గ అమ్మవారి ఆలయానికి సమీపాన ఈ నెల 5న జరిగే వైఎస్సార్ సీపీ సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ వీరా మల్లిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ కోరారు. మంగళవారం సఖినేటిపల్లిలంక, రామేశ్వరం, గుడిమూల గ్రామాల్లో ఈ మేరకు పార్టీ కార్యకర్తల సమావేశాలను వారు నిర్వహించారు. వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, సర్పంచ్‌లు కట్టా ఉమామహేశ్వరరావు, దెందుకూరి శ్రీహరిరాజు, పార్టీ చేనేత విభాగం రాష్ట్ర ప్రతినిధి జాన శంకరరావు, నాయకులు దివ్వి చిట్టిబాబు, గెడ్డం అమ్ములు, దొంగ నాగ సత్యనారాయణ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ఈ నెల 5న మలికిపురంలో జరిగే వైఎస్సార్ సీపీ సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిశోర్ పిలుపునిచ్చారు. కరవాకలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్సు యాత్రకు దళిత, గిరిజన, బహుజనులు వేలాదిగా తరలి రావాలన్నారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించే బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ దళితవాడల్లో పర్యటిస్తున్నానన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో ఉప్పాటి రాజేష్, తెన్నేటి దిలీప్, పులుసుగంటి అనిల్‌కుమార్, ఉందుర్తి వెర్రియ్య, దొండపాటి ఆనంద్, ఎం.సత్యనారాయణ, ఈతకోట శ్రీను, వెంకటరమణ, ఉందుర్తి వెంకటరమణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: నియోజకవర్గంలోని మలికిపురంలో ఈ నెల 5వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని రాజోలు మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం రాజోలులోని పార్టీ నాయకుడు దార్ల పెదబాబు స్వగృహం వద్ద గ్రామశాఖ పార్టీ కార్యకర్తలు, నాయకులు సమావేశం జరిగింది. సమావేశంలో సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, పార్టీ నాయకులు దార్ల పెదబాబు, బండారు కాశీ తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు

మలికిపురం: స్థానిక డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో శ్రీరామా బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ 2024 కప్ విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఏటా మాదిరిగానే ఈ దఫా కూడా అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ దెందుకూరి రాంబాబు రాజు సారథ్యంలో మూడు విభాగాలుగా అండర్-15 బాలుర, బాలికల విభాగంలో విజేతలకు బహుమతులను అందజేశారు. సీనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా కె.బాలు, వాసు టీమ్స్, రన్నర్స్‌గా కె.హరికృష్ణ, డి.రాంబాబు రాజు, జూనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా పెదపాటి జాన్ విలియం, దివ్వి కుమార్, రన్నర్స్‌గా ఎ.నాగబాబు, కె.చందు జట్లు గెలుపొందాయి. విజేతలకు మెమెంటోలను నిర్వాహకులు అందించారు. బెస్ట్ అంపైర్‌గా షేక్ మహబూబ్ జానీ వ్యవహరించారు. మండలి ఏఏఎం చైర్మన్ నల్లి శివకుమార్, కోచ్ కె.హరికృష్ణ, పి.రాజబాబు రాజు, రేకపల్లి వేణు, జోగి వెంకటేశ్వరరావు, పల్లపోతు బాబూరావు పాల్గొన్నారు.



షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలతో అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ రాంబాబు రాజు

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు



తొండవరంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు అవసరమయ్యే సేవలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. తొండవరంలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు అధ్యక్షతన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న ప్రభుత్వంలో నెరవేర్చారన్నారు. సచివాలయాలు ఏర్పాటు చేయడంతో గ్రామంలోని ప్రజలకు సంక్షేమ పథకాలు సంపూర్ణ స్థాయిలో అందుతున్నాయన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాల వ్యవస్థను ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, కేతా రాజు, మద్దింశెట్టి మల్లిబాబు, గోగి శ్రీరామమూర్తి, మద్దింశెట్టి పుల్లయ్యనాయుడు, పేరాబత్తుల కొండలరావు, కుడుపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబ ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

మోడేకుర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

కొత్తపేట: రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎం అండ్ హెచ్ఓ) ఎం.దుర్గారావుదొర కోరారు. జేఏఎస్ రెండో దశ అమలుకు సంబంధించి కార్యక్రమాన్ని మండలంలో మోడేకుర్రులో బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ వైద్య శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్ఓ పర్యవేక్షణలో సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి ప్రారంభించారు. డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలను ప్రజల వద్దకు చేరుస్తూ జేఏఎస్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. దానిలో భాగంగా అనారోగ్య బాధితులకు వారి సొంతూళ్లలోనే వైద్య సేవలు అందిస్తుందన్నారు. అంతేకాకుండా వారిని వైద్యపరంగా ప్రభుత్వం చేయి పట్టుకుని నడిపిస్తోందన్నారు. జేఏఎస్ శిబిరాల నుంచి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన రోగులను ఫ్యామిలీ డాక్టర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తారన్నారు. వారు ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందేందుకు ప్రభుత్వం ప్రయాణ చార్జీలు కూడా చెల్లిస్తుందన్నారు. ఈ సేవలన్నీ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.రవికుమార్, ఇంద్రావతి, స్పెషలిస్టు వైద్యులు, వివిధ వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలందించి, మందులు పంపిణీ చేశారు. ఆర్డీవో ఎం.ముక్కంటి, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు మామిడిశెట్టి ఏడుకొండలు, పార్టీ నాయకులు కుడుపూడి వెంకటేశ్వరరావు, సరెళ్ల లవరాజు, మాగాపు చక్రవర్తి, అవిడి పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ బీవీవీ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్స్ కె.మాచరరావు, వాడ సద్గుణరావు, రమణ, గ్రామ కార్యదర్శి శాంతి తదితరులు పాల్గొన్నారు.



మోడేకుర్రులో జేఏఎస్ శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావుదొర

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ జాన్ లేవి పేర్కొన్నారు. రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం ఆదుర్రులో జరిగింది. లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి స్పందన ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించి ఉచితంగా మందులు అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా సేవలందించారు. జిల్లా కోఆర్డినేటర్ జాన్ లేవి శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బళ్ల శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.



ఆదుర్రులో సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ జాన్ లేవి

వసంతవాడలో..

ఆత్రేయపురం: మండలంలోని వసంతవాడలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంపీడీఓ నాతిబుజ్జి, డాక్టర్ ఎన్.సుమలత పర్యవేక్షణలో సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స బంగారాజు, వాడపల్లి ఆలయ కమిటీ సభ్యుడు పెన్మెత్స సురేష్‌రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ క్యాంపులో ఉచితంగా ఈసీజీ పరీక్షలు నిర్వహించి 105 రకాల మందులను పంపిణీ చేశారు. ఎంపీడీఓ నాతి బుజ్జి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ క్యాంపులు జనవరి నుంచి జూన్ వరకూ ప్రతి వారం ఒక్కో సచివాలయం వద్ద నిర్వహిస్తామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రిఫరల్ ఆసుపత్రులకు తరలించి అక్కడ ఉచితంగా అన్ని వైద్య సేవలు అందేలా చేస్తారన్నారు. వీరికి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో 237 మందికి వైద్య సేవలు, 37 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాతి బుజ్జి

పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ

అయినవిల్లి: నిరుపేదల ఎవరూ ఇళ్లు లేకుండా ఉండకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి ప్రజల మనస్సులో స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని మడుపల్లిలో 36 మందికి రెండో విడత ఇళ్ల స్థలాల పట్టాలను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడారు.

బస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అమలాపురం ఆర్టీసీ బస్ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి వక్కలంక మీదుగా రావులపాలెం వెళ్లే నూతన సర్వీసు బస్‌ను సర్పంచ్ వాసంశెట్టి రేవతి ఆధ్వర్యంలో వక్కలంకలో మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ఆర్టీసీ బస్‌లో ప్రయాణించడమే శ్రేయస్కరమని, ఆర్టీసీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే చిట్టిబాబును పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి పెదబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు.

కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి, వాసంశెట్టి పెదబాబు, జనుపల్లి ఏడుకొండలు, వాసంశెట్టి వెంకటశెట్టి, శీకాగొళపు సత్తిబాబు, అయినవిల్లి సోమయాజుల శర్మ, మట్టపర్తి విష్ణుప్రసాద్, వాసంశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా కో కన్వీనర్‌గా మహాలక్ష్మీరావు

మామిడికుదురు: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో ఆర్డినేట్ కమిటీ కో-కన్వీనర్‌గా బి.దొడ్డవరం గ్రామానికి చెందిన పసుపులేటి మహాలక్ష్మీరావును నియమించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్ నుంచి ఉత్తర్వులు అందాయని మహాలక్ష్మీరావు మంగళవారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీశ్రీనివాస్‌కు, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబుకు మహాలక్ష్మీరావు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

పి.గన్నవరం: సీఎం జగన్ పరిపాలనలో గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. పోతవరంలో రూ.46.8 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకేలను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ వడలి కొండయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, నాయకులు గుత్తుల దాసు, మోకా పెద్ద, సబ్బితి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌పై డీఎల్‌డీఓ సమీక్ష

అయినవిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌డీఓ ఎం.ప్రభాకరరావు ఆధ్వర్యంలో అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి గరీబ్‌కల్యాణ్ అన్నయోజన ప్రధానమంత్రి దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన వంటి పథకాలు అర్హులైన పేదలకు అందుతున్నాయా లేదా అనే అంశం వారం రోజుల పాటు గ్రామాల్లో వివరించాలన్నారు. ఈ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై దాడి

ఆత్రేయపురం: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆత్రేయపురం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న వికలాంగుడైన జీవీవీ సత్యనారాయణ మంగళవారం చిన్న హరిజనవాడలో డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టారు. దీంతో ఆటోపై మురుగుపడిందని అదే గ్రామానికి చెందిన బండి దిలీప్ గొడవపడి సత్యనారాయణను కర్రతో కొట్టి గాయపర్చాడు. దీంతో సత్యనారాయణ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా దీంతో పంచాయితీ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లారు. ఆ సమయంలో డిజిటల్ అసిస్టెంట్ చింతా సాయిరాంపై బండి రవికుమార్, బండి వినయ్, పమ్మి రాజ్‌కుమార్, పమ్మి బేబీ అందరూ కలసి దుర్భాషలాడి కొట్టారు. దీంతో బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఇద్దరినీ చికిత్స నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ర్యాలిలో జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి రామకృష్ణ జెడ్పీ హైస్కూల్ వద్ద జనవరి 7న ఆదివారం జరిగే జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహణపై జిల్లా స్థాయి జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ చెకుముకి టెస్టు నందు జిల్లాలోని ప్రతి మండలాల నుంచి టీంకు ముగ్గురు విద్యార్థుల చొప్పున 26 యూనిట్లు నుంచి 52 టీమ్స్‌కు చెందిన 156 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జేవీవీ కార్యదర్శి ఎండీ ఖాజాముద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ, చెకుముకి జిల్లా కన్వీనర్ ఎస్.అబ్బులు తదితరులు ఉన్నారు.

పంట కాలువలో పూడిక తొలగింపు

మామిడికుదురు: పంట కాలువలో గుర్రపుడెక్క, తూడు పేరుకుపోవడంతో సాగు నీటి సమస్యకు తీవ్ర ప్రతిబంధకం ఏర్పడింది. దీంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట కాలువలో పూడిక తొలగించాలని పలు విజ్ఞాపనలు కూడా అందించారు. దీనిపై ఎట్టకేలకు స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. మామిడికుదురు బుల్లోడు వంతెన వద్ద నుంచి జేసీబీ సహాయంతో తూడుతో పాటు గుర్రపు డెక్కను తొలగించారు. దీంతో మామిడికుదురు, మాకనపాలెం, లూటుకుర్రు గ్రామాలకు చెందిన పంట భూములకు సక్రమంగా సాగునీరు సరఫరా అవుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



మామిడికుదురు పంట కాలువలో జేసీబీ సహాయంతో పూడిక తొలగింపు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

మామిడికుదురు: గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా సూచించారు. పాశర్లపూడిలంకలో ఉండ్రు సూర్యనారాయణ స్మారక గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 427 పుస్తకాలను, కంప్యూటర్‌ను కలెక్టర్ శుక్లా మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సేవలను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. గ్రంథాలయానికి ఎంత మంది విద్యార్థులు వస్తున్నారు. పని తీరు ఎలా ఉంది అన్న అంశాలను కలెక్టర్ తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెరుకూరి పార్వతి, ఉప సర్పంచ్ విప్పర్తి రమణ, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఎమ్మార్వో రియాజ్ హుస్సేన్, ఎంఈఓ మోకా వెంకన్నబాబు, ఈఓపీఆర్డీ ఏ.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.సురేష్, ఏఓ కె.వెంకటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.



పాశర్లపూడిలంక గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

ఈవని చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మూర్తి మృతి



ఈవని సూర్య నారాయణ మూర్తి (ఫైల్)

కొత్తపేట: ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్, ఈవని చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఈవని సూర్యనారాయణమూర్తి (63) మృతి చెందారు. స్థానిక ఈవని రామచంద్ర పెట్రోఫిల్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ తదితర సంస్థల చైర్మన్ అయిన సూర్యనారాయణమూర్తి ఆ సంస్థతో పాటు ఈవని రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వివిధ సామాజిక సేవలు నిర్వహిస్తారు. దానిలో భాగంగా ఏటా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు, పేదలకు దుస్తులు, దుప్పట్లు అందజేస్తుంటారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

క్రీడలతో మానసిక, శారీరక దారుఢ్యం

అయినవిల్లి: క్రీడలతో విద్యార్థుల్లో మానసిక, శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాల డైరెక్టర్ సీహెచ్‌వీ ప్రసాద్, ప్రిన్సిపాల్ సీహెచ్ బీనాజాన్ అన్నారు. రెండు రోజులుగా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నారు. మంగళవారం విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను క్రీడలు నిర్వహించారు. డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యా, క్రీడలపై ఆసక్తి పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

168 పింఛన్ల మంజూరు

ఆలమూరు: మండలంలో 168 సామాజిక పింఛన్లు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన విధంగా లబ్ధిదారులందరికీ రూ.మూడు వేలు చొప్పున అందజేస్తామన్నారు. దీంతో మండలంలో పింఛన్ల సంఖ్య 11,321కు పెరిగగా రూ.3.32 కోట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా శోభాయాత్ర

మామిడికుదురు: అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను ఊరేగిస్తూ మంగళవారం లూటుకుర్రులో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయోధ్య అక్షతలతో పాటు స్వామి వారి ఫొటో, జనవరి 22న జరిగే శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలని ఆహ్వానిస్తూ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అడబాల తాతకాపు, గ్రామస్తులు మద్దాల కృష్ణమూర్తి, బోణం బాబు, గాడి సత్తిబాబు, తదితరులు శోభాయాత్రలో పాల్గొన్నారు.